ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★
జిల్లా వార్తలు
మంగళవారం 29 అక్టోబరు 2024

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- జిల్లాలో 30,352 మరమగ్గాలు
- త్వరలో స్వశక్తి చీరల ఉత్పత్తి ఆర్డర్లు
- నేతన్న బీమా పథకంలో 5 వేల మంది చేరిక
- సాగర్, చేనేత జౌళి శాఖ ఏడీ

ఇంటర్వ్యూ


సాగర్ చేనేత జౌళి శాఖ ఏడీ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)
సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రభుత్వం నుంచి ఆర్డర్లు వస్తున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ తెలిపారు. జిల్లాలో 30,352 మరమగ్గాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించి పలు అంశాలను సోమవారం ఆంధ్రజ్యోతికి వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కార్మికుల ఉపాధికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

చేనేత జౌళి శాఖ ఏడీ : జిల్లా కేంద్రంలో పని చేస్తున్న పవర్‌లూం కార్మికుల ఉపాధి మెరుగుపడే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. సమగ్ర శిక్ష, సంక్షేమ శాఖల నుంచి మ్యాక్స్, ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు 48.68 లక్షల మీటర్ల స్కూల్ యూనిఫాం ఆర్డర్లు వచ్చాయి. టెక్స్‌టైల్ పార్కులో రాపియర్ మరమగ్గాలపై 49.94 లక్షల మీటర్ల ఆర్డర్లు వచ్చాయి. స్వశక్తి సంఘాల మహిళలకు రెండు చొప్పున చీరలు అందించడానికి త్వరలోనే ఆర్డర్లు రానున్నాయి. 8.20 కోట్ల మీటర్లు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : సిరిసిల్లలో ఎన్ని మరమగ్గాలు, ఎంతమంది కార్మికులు ఉన్నారు?

చేనేత జౌళి శాఖ ఏడీ : రాజన్న సిరిసిల్ల జిల్లాలో 30,352 మరమగ్గాలు ఉండగా జియో ట్యాగింగ్ చేసినవి 25,533 ఉన్నాయి. పవర్‌లూం కార్మికులు 5 వేల మంది, సైజింగ్, వార్పిన్, డైయింగ్, వైపనికి సంబంధించిన కార్మికులు 3 వేల మంది ఉన్నారు. 270 వార్పిన్ యూనిట్లు ఉన్నాయి.

మిగతా 8లో

న్యూస్ బాక్స్

సిరిసిల్ల ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డి

సిరిసిల్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డిని నియమిస్తూ సోమవారం రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ కీసర ఆర్డీవోగా పనిచేస్తున్న వెంకట ఉపేందర్ రెడ్డి సిరిసిల్లకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఆర్డీవో హైదరాబాద్ కమిషనరేట్‌లో రిపోర్టు చేశారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన

ఇల్లంతకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరెడ్డిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యార్థినులకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై వివరించారు. వేధింపులకు గురైతే షీటీం సభ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోనే సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఇల్లంతకుంట అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పశువైద్యాధికారిగా అయిత పూర్ణ చంద్రిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా వ్యవహరించిన సతీష్ బోయిన్‌పల్లికి బదిలీ అయ్యారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో పూర్ణచంద్రిక 20వ ర్యాంకు సాధించి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు.

లెక్క తేలనుంది..



- ఫిబ్రవరి వరకు 21వ పశు గణన
- జిల్లాలో ఇంటింటి సర్వేకు ఏర్పాట్లు
- ఐదేళ్లలో తగ్గినట్లు అంచనా
- 54 మంది ఎన్యూమరేటర్లు
- 13 మంది సూపర్‌వైజర్లు
- పశు గణన కోసం ప్రత్యేక యాప్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)
జిల్లాలో మూగ జీవాల లెక్క తేల్చడానికి పశు సంవర్ధకశాఖ 21వ పశుగణన ప్రారంభించింది. ఆశాఖ సిబ్బంది ఫిబ్రవరి 2025 వరకు ఇంటింటికి వెళ్లి మూగజీవాల వివరాలు సేకరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 255గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో ఎన్యూమరేటర్లు 16రకాల పశు జాతుల వివరాలు సేకరించనున్నారు. ఆవులు, ఎద్దులు, గేదేలు, కోళ్లు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, పెంపుడు కుక్కలతో పాటు గుర్రాలు, గాడిదలు, వంటి వాటిని కూడా లెక్కిస్తారు.

మండలాల వారీగా 2019 పశుగణన వివరాలు

మండలం	సంఖ్య
రుద్రంగి	3971
చందుర్తి	6630
బోయినపల్లి	7195
వేములవాడ అర్బన్	4363
వేములవాడ రూరల్	6251
కోనారావుపేట	7199
వీర్నపల్లి	8888
ఎల్లారెడ్డిపేట	9732
గంభీరావుపేట	11388
ముస్తాబాద్	10827
సిరిసిల్ల	2706
తంగళ్లపల్లి	14311
ఇల్లంతకుంట	14164
మొత్తం	112192

ఇందుకోసం జిల్లాలోని 13 మండలాలకు 13మంది సూపర్ వైజర్లు, 54 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి పశుగణన చేయనున్నారు. ఒక ఎన్యూమరేటర్ 4500 ఇళ్ల వరకు వెళ్లి లెక్కిస్తారు.



జిల్లాలో 13.43 లక్షల పశువుల లెక్కా

2019లో నిర్వహించిన 20వ పశు గణన లెక్కల ప్రకారం జిల్లాలో 19.39 లక్షల వివిధరకాల మూగజీవాలు ఉన్నట్లు లెక్క తేల్చారు. ప్రస్తుతం ఈ లెక్కలో గొర్రెలు, పశువులు, ఇళ్లవద్ద తగ్గి డెయిరీలో ఫామ్స్‌లో పెరిగినట్లు తెలుస్తుంది. 20వ పశుగణన ప్రకారం జిల్లాలో 44వేల ఆవులు, 73 వేల గేదెలు, 3.88 లక్షల గొర్రెలు, 88 వేల మేకలు, 3 వేల పందులు, పెంపుడు కుక్కలు 300, పౌల్ట్రీల్లో 7.44 లక్షలు ఉన్నాయి. ఈసారి గణనలో కుక్కలు, ఇతర లెక్కలు పెరగనున్నాయి. మిగతా 8లో

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

- కిటకిటాలడిన కలెక్టరేట్
- సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

8


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- కొనుగోలు కేంద్రాల ప్రారంభం

8


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

గ్రీవెన్స్ డేతో బాధితులకు సత్వర న్యాయం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 18 ఫిర్యాదులు స్వీకరించినట్లు చెప్పారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించామని అన్నారు. భూ, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించామన్నారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత కుండా చూస్తున్నామన్నారు. నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటికి పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి.. కరాటే శిక్షణ ప్రవృత్తి

- మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఇంగ్లీష్ టీచర్
- జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు


విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇస్తున్న మల్లేశం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వృత్తి పరంగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా విధులు నిర్వహిస్తూనే, ప్రవృత్తిగా తాను పనిచేస్తున్న పాఠశాలలో ప్రతీ రోజు సాయంత్రం బాలబాలికలకు ఉచితంగా కరాటేలో శిక్షణ అందిస్తున్నాడు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు పతకాలు సాధించేలా తీర్చిదిద్దుతున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన కుమ్మరి మల్లేశం చదువుకునే రోజుల్లో మార్షల్ ఆర్ట్స్ (కిక్ బాక్సింగ్), వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్‌లో శిక్షణ పొందాడు. ప్రస్తుతం సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. విద్యా బోధన చేస్తూనే తాను నేర్చుకున్న కరాటేను విద్యార్థినుల ఆత్మరక్షణ కోసం నేర్పించాలనుకున్నాడు. బాలబాలికలకు ఉచితంగా కరాటేలో శిక్షణ అందించడం మొదలు పెట్టాడు. కరాటేలో విద్యార్థులు ప్రతిభ కనబర్చడం గమనించి ప్రతీ రోజు సాయంత్రం కొంత సమయం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాడు. మల్లేశం వద్ద శిక్షణ పొందుతున్న పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. ఈ సందర్భంగా మల్లేశం సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

- కుమ్మరి మల్లేశం, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కరాటే ఇన్‌స్ట్రక్టర్



బాలికలకు కరాటే ఆత్మరక్షణగా ఉపయోగపడుతుంది. నేను ఎక్కడ పనిచేసినా అక్కడి విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తూ వస్తున్నాను. శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు ప్రస్తుతం జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం అందిస్తున్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని, ఓటరు జాబితా సవరణ 2025పై స్వీప్ కార్యక్రమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఓటరు జాబితా సవరణ 2025 స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై క్యాంపస్ అంబాసిడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. అక్టోబరు 29న జిల్లాలో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. పేర్లను జాబితాలో చెక్ చేసుకోవాలని, లేని పక్షంలో నవంబరు 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. నూతన ఓటరు నమోదుకు సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు నవంబర్ 1 నుంచి నవంబర్ 26 వరకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని కళాశాల్లో అర్హులైన యువకులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యా సంస్థకు ఒక క్యాంపస్ అంబాసిడర్‌ను నియమించామని, ఆ విద్యా సంస్థలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా అంబాసిడర్‌లు పని చేయాలని కోరారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితాపై అభ్యంతరాలను నవంబరు 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబరు 26 లోగా వాటిని పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించిన షెడ్యూల్‌ను తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, స్వీప్ నోడల్ అధికారి జడ్పీ సీఈవో వినోద్ కుమార్, ఎంపీడీవోలు, క్యాంపస్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి

చందుర్తి, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలని మండల కళాకారుల సంఘం నాయకులు దొంగరి లక్ష్మీరాజం, మర్రి మల్లేశం అన్నారు. చందుర్తిలో సోమవారం మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కళాకారులు ఎంతగానో కృషి చేశారని, కళాకారులను ప్రభుత్వం ఆదుకున్న దాఖలు లేవని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను కళాకారులను గుర్తించి వారికి పెన్షన్, ఇంటి స్థలాన్ని కేటాయించాలన్నారు. కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు నిరుపేద కళాకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బైపాస్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు కనెక్షన్లు ఇవ్వండి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు కనెక్షన్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు జంక్షన్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు 11 కిలోమీటర్ల ఫోర్‌లైన్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సిరిసిల్ల నుంచి కోనరావు పేటకు వెళ్లే దారిలో ఉన్న జంక్షన్ వద్ద నిత్యం ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో ఆ ప్రాంతాన్ని సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ రహదారివెంట ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలకు వెంటనే విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సెస్ అధికారులకు సూచించారు. శాశ్వత ప్రాతిపదికన పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ డీఈఈ వాణి, ఏఈ స్వామి పాల్గొన్నారు.


చంద్రంపేట చౌరస్తాను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఉత్సాహంగా 2కే రన్


2కే రన్‌లో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సిరిసిల్ల పట్టణంలోని నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ఎస్పీ అఖిల్ మహజన్ 2కే రన్‌ను ప్రారంభించారు. పట్టణంలోని గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2కే రన్‌లో ప్రజలు, విద్యార్థులు భాగస్వామ్యం కావడం అనందంగా ఉందన్నారు. ప్రజా క్షేమం కోసం పనిచేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ఏటా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అమరవీరుల ఆశయ సాధనకోసం సమాజంలో ప్రతీ ఒక్కరు బాధ్యతగా మెలగాలన్నారు. ప్రజా రక్షణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్య రక్షణకు వ్యాయామం చేయాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. శారీరక దారుడ్యం పెరుగుతుందన్నారు. యువత చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, మెడికల్, నర్సింగ్, జేఎన్టీయూ కళాశాలల విద్యార్థులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.


2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థినులు

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో

దంపతుల ఆత్మహత్య

పెద్దపల్లి జిల్లా నాగారంలో ఘటన



సుజాత, శంకర్‌గౌడ్ (ఫైల్)

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని నాగారం గ్రామంలో అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో భార్యభర్తలు సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొడిగె శంకర్‌గౌడ్ (50), సుజాత (45)లు భార్యాభర్తలు. శంకర్‌గౌడ్ గీత కార్మికుడిగా, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. భార్య సుజాత పది సంవత్సరాలుగా వెన్నుపూస నొప్పితో బాధపడుతోంది. ఐదు సంవత్సరాల క్రితం ఆపరేషన్ జరిగింది. అయిన పట్పటికి నొప్పి తగ్గలేదు. ఇటీవల వైద్యులను సంప్రదించగా మళ్లీ ఆపరేషన్ చేయించాలని సూచించారు. దీంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతన్న దంపతులు మానసిక ఆందోళనకు గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సాయంత్రం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించడంతోపాటు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ముగ్గురు కూతుళ్లు ఉండగా వారికి వివాహం చేశారు.

పాఠశాల ఆవరణలో

పాముల సంచారం

- మైదానంలోని నర్సరీలో ఆవాసం
- భయాందోళనలో విద్యార్థులు



పాఠశాల ఆవరణలో సంచరిస్తున్న పాము

తంగళ్లపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పాముల సంచారంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం పాఠశాల మైదానంలో పాము కనిపించ డంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మైదానంలో పాము అటు ఇటు తిరగడంతో పరుగులు పెట్టారు. కొద్దిసేపటికి పాము వెళ్లిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. పాఠశాల ఆవరణలో నర్సరీ ఏర్పాటు చేయడంతో పాములు అందులో ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయని, తరచూ పాఠశాలలో సంచరిస్తున్నాయని విద్యార్థులు, స్థానికులు పేర్కొంటున్నారు. పాఠశాల ఆవరణ నుంచి నర్సరీని తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నర్సరీని మరోచోటుకు తరలించాలని కోరుతున్నారు.

పెన్షన్ ఇప్పిస్తానని బంగారు గొలుసు చోరీ



బాధితురాలు చంద్రకళ

జమ్మికుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ ఇప్పిస్తానని మాయా మాటలు చెప్పి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. జమ్మికుంట పట్టణానికి చెందిన సూదం చంద్రకళ ఉదయం 11గంటల సమయంలో శివాలయానికి వెళ్లేందుకు సురక్ష ఆసుపత్రి రోడ్డులో వెళుతోంది. ఆమె వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అమ్మ మీకు పెన్షన్ వస్తుందా అని అడిగాడు. లేదని ఆమె చెప్పింది. తాను ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఫొటో తీసుకోవాలి, మెడలో ఏం ఉండకూడదని అని చెప్పాడు. ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు తీసుకున్నాడు. సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి ఇక్కడే ఉండు.. ఫొటో ప్రింట్ తీసుకుని వస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయించాడు. కొద్దిసేపు వేచి చూసిన చంద్రకళ అతడు రాకపోయేసరికి మోసపోయానని గ్రహించింది. రోదిస్తూ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సహకారంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

వంటే వారికి ఉపాధి

- బంధనకల్ గ్రామస్థుల వంటలకు భలే డిమాండ్
- మొదట ఒకరిద్దరితో ప్రారంభం
- ప్రస్తుతం 200 మందికిపైగా ఉపాధి



వంటలు చేస్తున్న యువకులు

విందు ఏదైనా బందనకల్ వంటలకు ఉన్న క్రేజే వేరు. వివాహాది శుభకార్యాలతోపాటు సభలు, సమావేశాల్లో ఆ గ్రామస్థుల వంటలకు ప్రత్యేకత గుర్తింపు. మొదట గ్రామానికి చెందిన ఒకరిద్దరు వంటలు చేస్తూ ఉపాధి పొందారు. రోజురోజుకు ఆర్డర్లు పెరగడంతో గ్రామంలోని మరికొంత మందిని జత చేసుకున్నారు. డిగ్రీలు చదువుకున్న వారి పిల్లలు కూడా ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నిస్తూనే వంటలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో 200 మంది బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో వంటలు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు.

ముస్తాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలంలోని బందనకల్ గ్రామస్థులు వంటలు చేయడంలో సిద్దహస్తులు. వివాహాది, శుభకార్యాలతోపాటు పార్టీల సభలు, సమావేశాల్లో వీరి వంటలకు ప్రత్యేక గుర్తింపు. 30 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన చిగురు మల్లేశం అటెండర్‌గా పని చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచిన్న సమావేశాలు, విందులకు వంటల చేసేవాడు. ఆయన చేసే వంటలు బాగుండడంతో ఆర్డర్లు రావడం పెరిగింది. దీంతో గ్రామానికి చెందిన చిగురు రాములు, రాజయ్య, మల్లయ్య నారాయణ జతకట్టారు. ఎక్కడ శుభ కార్యాలు జరిగినా మల్లేశం బృందం ఉండేది. బందనకల్ నుంచి హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లి వంటలు చేసి వచ్చేవారు. అనంతరం వారి పిల్లలు కూడా చదువుతోపాటు వంటలు చేయడం నేర్చుకున్నారు. ఓ వైపు డిగ్రీలు, పీజీలు చదువుతూ వంటల్లో ఆరి తేరారు. బృందాలుగా ఏర్పడి వంటలు చేయడం ప్రారంభించారు.

ఇలా గ్రామంలో 200 మందికిపైగా వంటలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. సాధారణ సమయాల్లో విడివిడిగా వంటలు చేసినా పెద్ద ఆర్డర్లు వచ్చిన సందర్భాల్లో వీరంతా ఒక్కటవుతారు. పది వేల మందికి అవలీలగా వంటలు చేస్తారు. విందులు, శుభాకార్యాలు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు సంబంధించిన ఆర్డర్లు ముందుగా ఇక్కడి యువతకే వస్తాయి. మాజీ సీఎం కేసీఆర్, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ నుంచి సైతం ప్రశంసలు అందుకున్నారు.

కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్న

చిగురు మధు, బంధనకల్



డిగ్రీవరకు చదువుకున్నా. చదువుకునే రోజుల్లోనే కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్నా. భవిష్యత్ సాఫీగా ఉండాలని భావించా. మా పెద్దల దగ్గర వంటలు చేయడం నేర్చుకున్నా. వందల వేల సంఖ్యలో పెద్ద పెద్ద కార్యక్రమాలు చేశాం. కేసీఆర్, సీహెచ్ విద్యా సాగర్‌రావు, కేటీఆర్ వంటి ప్రముఖులు మా వంటల రుచులు చూశారు.

ఇదో ఆదాయ వనరు

: జెల్ల నాగరాజు, బంధనకల్



పాకశాస్త్రానికి మంచి ఆదరణ ఉంది, శుభాకార్యలు ఎల్లప్పుడూ ఉంటాయి. తద్వారా వంటలకు ఆర్డర్లు లభిస్తుంటాయి. చదువులకు ఆటంకం కలుగకుండా జాగ్రత్తలు తీసుకొని వంటల్లో ప్రావీణం పొందాం. దాదాపు పది వేల మందికి పైగా అవలీలగా వంటలను రుచికరంగా అదిస్తాం.

సీనియర్ల సహకారంతో వంటలు నేర్చుకున్నా..

ప్రతాప్, బంధనకల్



సీనియర్ల సహకారంతో వంటలు నేర్చుకున్నా. ఎంబీఏ పూర్తి చేశాను. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే వంటలు నేర్చుకోవడానికి సీనియర్ల వెంట వెళ్లా. ప్రస్తుతానికి ఇదే వృత్తిగా మారింది. దీని ద్వారా ఉపాధి పొందుతున్నా.

పెద్దల నుంచి నేర్చుకున్నా : పండరి, బంధనకల్



డిగ్రీ వరకు చదువుకున్నాను. ఉద్యోగావకాశాల కోసం వేచి చూడకుండా మా పెద్దల వెంట వెళ్లి వంటలు నేర్చుకున్నా. ఎలాంటి వంటలైనా చేస్తాం. అతిథులు వంటలు బాగున్నాయని కితాబిస్తే సంతోషంగా ఉంటుంది.

హనుమాన్ విగ్రహం ధ్వంసం

గుర్తు తెలియని వ్యక్తుల పనే అంటూ భక్తుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న హిందూ సంఘాలు

బీర్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి స్వాగత తోరణానికి కుడి వైపున ఉన్న హనుమాన్ విగ్రహం ధ్వంసం అయి పడి ఉండడంతో మండలంలోని హిందూ సంఘాల నాయకులు, హనుమాన్ భక్తులు సోమవారం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న జగిత్యాల సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని పట్టుకొని చట్టపరంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ఆలయ స్వాగత తోరణానికి కుడివైపు ఉన్న హనుమాన్ విగ్రహం ధ్వంసం చేశారని అర్చకుడు వొద్దపర్తి సంతోషాచార్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సోమవారం సాయంత్రం సుమారు 6గంటలకు బీర్‌పూర్ గ్రామానికి చెందిన అల్లెపు సిద్దార్థ్ ట్రాక్టర్ నడుపుతుండగా ట్రా క్టర్ ముందు టైరు పంక్చర్ అయి అదుపుతప్పి ప్రమాదవశాత్తు హనుమాన్ విగ్రహాన్ని ఢీకొట్టినట్లు తెలిసిందన్నారు. ఈ ప్రమాదానికి కారకుడైనా అల్లెపు సిద్దార్థ్‌ను అదుపులోనికి తీసు కొన్నట్లు తెలిపారు. ధ్వంసమైన విగ్రహం స్థలంలో మరో విగ్రహాన్ని ఏర్పాటు చేసి విగ్రహ పునఃప్రతిష్ఠ చేసే విధంగా ఆలయ ఈవో, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ సంఘటన కేవలం ప్రమాదవశాత్తు మాత్రమే జరిగిందని, ఈ విషయంలో ఎలాంటి పుకార్లను, తప్పుడు కథనాలను నమ్మవద్దని, సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయవద్దని పోలీసుల విజ్ఞప్తి చేశారు.

ఇంటికి చేరే లోపే కబళించిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్త, ఇద్దరు కొడుకులకు గాయాలు
- మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన



మృతిచెందిన శైలజ

మంథని, అక్టోబరు 28: తల్లిగారి ఇంటి నుంచి బయలుదేరి కొద్దిసేపట్లో తమ ఇంటికి చేరే క్రమంలో సెగ్గెం శైలజ (24) అనే వివాహితను మృత్యురూపంలో ఇసుక లారీ కబళించగా, భర్త, ఇద్దరు కొడుకులు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులోని గాడుదులగండి గుట్టపై చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం..

మండలంలోని అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన సెగ్గెం శైలజ, భర్త రాహుల్, ఇద్దరు కవలలతో కలిసి తన తల్లి గారి ఇంటికి మంచిర్యాల జిల్లా వేలాలకు వెళ్లింది. సోమవారం భర్త, పిల్లలతో కలిసి తమ ద్విచక్ర వాహనంపై అడవిసోమన్‌పల్లి గ్రామానికి బయలు దేరారు. గాడుదులగండి గుట్టపై టీఎస్ 02 డీ 8353 అనే లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. బండిపై వెనకాల కూర్చున్న శైలజ ఒక్కసారిగా కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో భర్త రాహుల్, ఇద్దరు కుమారులకు సైతం తీవ్రంగా గాయాలయ్యాయి.

సంఘటన స్థలంలో శైలజ మృతదేహం వద్ద భర్త రాహుల్ రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. గాయపడ్డ వారిని స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గోదావరిఖనికి తరలించారు. శైలజ మృతిపై కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంథని -కాటారం ప్రధాన రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఇసుక లారీలు వేగంగా నడిపిస్తుండటంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని భైఠాయించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ రమేష్ చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం శైలజ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విలు విద్యలో రాణిస్తున్న శ్రీహన్స్‌కార్తికేయ

ఎస్ఎఫ్ఏ పోటీల్లో బంగారు పతకం కైవసం



శిక్షణ పొందుతున్న శ్రీహన్స్ కార్తికేయ

ముత్తారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టుమని పదేళ్ల కూడా లేని ఆ బాలుడు విలువిద్యలో రాణిస్తున్నాడు. ఇటీవల జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-9 విభాగంగా రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించి పలువురి ప్రశంసలందుకున్నాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన లింగం శ్రీహన్స్ కార్తికేయ. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. శ్రీహన్స్ కార్తికేయ తండ్రి లింగం శ్రీనివాస్ వృత్తిరీత్యా టీచర్ కావడంతో మిత్రుల ద్వారా ఆర్చరీపై ఆసక్తి కలిగింది. దీంతో తన కొడుక్కి మొదట్లో మంథనిలో కోచింగ్ ఇప్పించాడు. కొంతకాలంగా కరీంనగర్‌లోని శ్రీకృష్ణ ఆర్చరీ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తున్నాడు. ఈక్రమంలోనే ఈ నెల 15న జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీహన్స్ కార్తికేయ పాల్గొని బంగారు పతకం సాధించాడు. రానున్న డిసెంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు సాధన చేస్తున్నాడు.



రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన శ్రీహన్స్

గోదావరిఖనిలో గాంధీ మార్కెట్ కూల్చివేత

కోల్‌సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెయిన్ చౌరస్తా సమీపంలోని గాంధీ మార్కెట్‌గా పిలువబడే షాపుల ను సోమవారం రామగుండం నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం కూల్చివేసింది. అదన పు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం ఉదయం ఈ కూల్చివేతలు జరిపారు. ఈ ప్రాంతంలో సింగ రేణి, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శాశ్వత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురానున్నా రని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షాపులను ఖాళీ చేయాలని ఇటీవలే టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యాపారులకు సమాచారం ఇచ్చారు. కొందరు ఖాళీ చేయగా మరికొందరు ఖాళీ చేయలేదు. సోమవారం ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్స్‌కవేటర్ తీసుకొని రావడంతో షటర్లలో వ్యాపారం నిర్వహిస్తున్న వారు హడా విడిగా ఖాళీ చేశారు. తరువాత వాటిని నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు.

18ఏళ్ల క్రితం తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు...

రామగుండం నగరపాలక సంస్థ పోచమ్మ మైదాన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సింగరేణి సంస్థ స్థలాన్ని ఇచ్చింది. అప్పటి కూరగాయల మార్కెట్‌తో పాటు పోచమ్మ మైదాన ప్రాంతంలో ఉన్న చిన్న చిన్న దుకాణాలను అప్పటి చైర్మన్ బడికెల రాజలింగం ఆధ్వర్యంలో కూల్చి వేశారు. వారికి తాత్కాలికంగా వ్యాపారాలు చేసుకునేందుకు పునరావాసం క్రింద మున్సిపాలిటీ సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి రైతు బజార్ నిర్వహిస్తున్న స్థలాన్ని అప్పగించింది. ఆరు నెలల్లో ఖాళీ చేస్తామని మున్సిపల్ హామి ఇచ్చి స్థలాన్ని తీసుకున్నది. సుమారు 50మంది యజమానులు, కిరాయిదారులకు కేటాయించారు. పోచమ్మమైదానంలో షాపులు కోల్పోయిన వ్యాపారులు లక్ష్మీనగర్‌లో వ్యాపారాలు చేస్తున్నారు. ప్రస్తుతం గాంధీ మార్కెట్‌లో అప్పుడు షాపులు తీసుకున్న ఒకరిద్దరు వ్యాపారాలు చేస్తున్నారు. అందరు పండ్ల గోడౌన్‌లకు, ఇతర వ్యాపారాలకు కిరాయిలకు ఇచ్చారు. ఈ తాత్కాలిక మార్కెట్ స్థలంలో వ్యాపార సముదాయాన్ని నిర్మించేందుకు షాపులను తొలగించారు.

దొంగతనం కేసులో పలువురికి జైలు శిక్ష

బోయినపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరికి 17 నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి సోమవారం తీర్పు వెల్లడించినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీందర్ గౌడ్ తెలిపారు. బోయినపల్లి మండలం కొదురుపాక ఎల్లమ్మ దేవాలయంలో సంఘ ప్రణయ్, షైక్ సోహెల్ దొంగతనికి పాల్పడ్డారని కొదురుపాకకు చెందిన నాగుల నాగరాజు ఫిర్యాదుతో బోయినపల్లి పోలీస్‌లు కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి మహేందర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి సంఘ ప్రణయ్, షైక్ సోహెల్‌కు 17 నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

మరో కేసులో 18 నెలల జైలు శిక్ష

వేములవాడ టౌన్ : దొంగతనం కేసులో ఇద్దరికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి సోమవారం తీర్పు వెల్లడించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ సోమవారం తెలిపారు. వేములవాడ మండలం రుద్రవరంలోని ఎల్లమ్మ ఆలయంలో దొంగతనం జరిగినట్లు అప్పటి సర్పంచ్ 2023 ఫిబ్రవరి 7న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి వెంకట్రాజం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపు విక్రాంత్ కేసు వాదించగా న్యాయమూర్తి జ్యోతిర్మయి పూర్వపరాలను పరిశీలించి ప్రణయ్, సోహెల్‌కు 18 నెలల కారాగార జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

సిరిసిల్ల క్రైం: దొంగతనం కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. సిరిసిల్ల నెహ్రూ నగర్ అంబాభవాని ఆలయంలో 27 ఫిబ్రవరి 2017 రాత్రి పూజ అనంతరం గుడికి తాళం వేసి వెళ్లిపోయారు. దొంగ గుడి గేటు తాళం పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లి మానేరు వాగులో పడేశాడు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి దొంగతనం చేసిన మానకొండూరు మండలం ఊటూరుకు చెందిన వడ్డేపల్లి సత్యం (38)ను రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం అప్పటి పోలీస్ అధికారి లియకత్ అలి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారి ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్, ఏడుగురు సాక్షులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ చెలుముల సందీప్ వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ సత్యంకు జైలు శిక్ష విధించారు.

గంజాయి తరలిస్తున్న వారిపై కేసు నమోదు

ధర్మపురి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పటేల్ గార్డెన్స్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగుల మహేష్ తెలిపారు. మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన సల్లూరి రమేష్, మంచిర్యాల జిల్లా జన్నారం గ్రామానికి చెందిన జన్నోజు రాజేష్ అలియాస్ శివ కొంత కాలం నుంచి గంజాయి తాగడం కోసం అలవాటు పడ్డారని ఆయన పేర్కొన్నారు. తమ వద్ద ఉన్న గంజాయిని జల్సాలక అలవాటు పడి ఇతరులకు అమ్మేవారని ఆయన తెలిపారు. ఉదయం తమ వద్ద ఉన్న 500 గ్రాముల గంజాయిని ఇతరులకు విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

రుద్రంగి: మండల కేంద్రం శివారులోని గంగమ్మ ఆలయం వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వేములవాడ మండలానికి చెందిన నాగరాజు, జగన్‌ల వద్ద 120 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ ధర్మాబాద్‌కు చెందిన ఎండి హుస్సేన్ (28) మద్యానికి బానిసై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్ తరచూ మద్యం సేవిస్తుండేవాడు. ఆదివారం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. కుటుంబసభ్యులను మద్యానికి డబ్బులు కావాలని అడుగగా ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటి దగ్గరలోని చెట్టుకు రాత్రి సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సల్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు సత్యనారాయణపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణ జామకాయ ఇస్తానని చెప్పి బాలికను ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించగా బాలిక ఏడవడంతో ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించి అక్కడి నుంచి పంపించాడు. ఆ బాలిక ఇంటికి వచ్చి తల్లికి విషయం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట

దళిత బంధు లబ్ధిదారుల ధర్నా



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

వీణవంక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి ఎదుట దళితబంధు లబ్ధిదారులు రెండో విడత నిధులు విడుదల చేయాలని సోమవారం ధర్నా నిర్వహించారు. దీంతో బీఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడించారు. దళితబంధు లబ్ధిదా రులతో కలిసి ప్రభుత్వంపై ఆందోళన చేపడతానని ఎమ్మెల్యే వారికి చెప్పడంతో వారు ధర్నాను విరమించారు.

వరుదకాలువలో గల్లంతైన వైద్యుడి మృతదేహం లభ్యం



ఉదయ్‌కిరణ్‌రెడ్డి (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం లోని విట్టంపేట గ్రామ శివారులోని వరద కాలువలో గల్లంతైన ప్రైవేటు వైద్యుడు పాకం టి ఉదయ్‌కిరణ్‌రెడ్డి (29)మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్న ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఆదివారం తన స్నేహితులతో కలిసి కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత కొడుతుండగా నీటి ప్రవాహం ఎక్కువ ఉన్న ప్రాంతంలో ఉదయ్‌కిరణ్‌రెడ్డి అందులో మునిగిపోయాడు. నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో రాత్రి గాలించినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం వరుద కాలువలో కొంత దూరంలో వైద్యుడి మృతదేహం కనిపించింది. కాలువలో నుంచి మృతదేహాన్ని పోలీసులు గ్రామస్థులతో బయటకు తీయించి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉదయ్‌కిరణ్‌రెడ్డి తండ్రి శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి స్వగ్రామమైన హనుమకొండ జిల్లా సరసపల్లి మండలంలోని వేలేరులో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కేబీబీవీ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందిస్తాం

మంత్రి శ్రీధర్ బాబు



విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి) కేజీబీవీలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు ఆదివారం అస్వస్థతకు గురైన విద్యార్థినులు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి వరకు విద్యార్థినులు కోలుకున్నారు. వారిలో కొందరు సోమవారం ఉదయం మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. వారిని మంత్రి డి శ్రీధర్‌బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..

ముత్తారం మండలంలోని కేజీబీవీలో విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా జిల్లా ఆసుపత్రికి 53 మందిని తరలించి 10 మంది వైద్యులు, 20 మంది స్టాఫ్ నర్సులు ఆధ్వర్యంలో అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామన్నారు. కొంత మంది బాలికలకు చలికాలంలో శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొనే మెడికల్ హిస్టరీ ఉందని, వారికి ఆసుపత్రిలో ఆక్సిజన్ అందిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారిని ఇన్‌చార్జిగా నియమించి బాలికలకు అందిస్తున్న చికిత్సను పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పామన్నారు. విద్యార్థినులు ఒకేసారి అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలను విచారిస్తున్నామన్నారు. పాఠశాలకు సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. విద్యార్థినులు క్షేమంగా ఉన్నారని, వారు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వైద్యులు, కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఆర్డీవో బి గంగయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

6

విత్తనం... వ్యవసాయానికి మూలాధారం. మేలురకం కంకులను, కాయలను భద్రపరుస్తూ విత్తనంగా వాడుకోనేవారు. ప్రస్తుతం రసాయనిక ఎరువులు, వాతావరణ కాలుష్యంతో నేలసారం తగ్గిపోతోంది. ఈనేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో దేశీయ వరి వంగడాలను రూపొందిస్తున్నారు. ఈ కోవకు చెందినవారే పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్. ఇప్పటి రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని పరిచయం చేస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నాడు.



శ్రీనివాస్ రూపొందించిన దేశీయ విత్తన కంకులు

ప్రకృతి వ్యవసాయానికి 'బీజం'

- మేలు రకం విత్తనాల ఉత్పత్తి
- సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు
- దేశవాళీ విత్తన ప్రేమికుడు ఏవో యాదగిరి శ్రీనివాస్

రామగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్ దేశవాళీ విత్తనోత్పత్తి ప్రేమికుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. వ్యవసాయంపై ఏర్పడిన మక్కువ అతడిని వ్యవసాయ విద్య వైపు మళ్లించింది. జగిత్యాలలోని పొలాసలో డిప్లొమా కోర్సు పూర్తి చేసి వ్యవసాయ విస్తరణ అధికారిగా 2011లో ఉద్యోగం సాధించాడు. 2016 నుంచి మేలు రకం విత్తనాలను సేకరించడం ప్రారంభించాడు. ఖాళీ సమయాల్లో వ్యవసాయ క్షేత్రంలో దేశీయ విధానంలో వరి సాగు చేపట్టాడు. గ్రామంలో తనకున్న రెండెకరాల్లో దేశవాళబియ్యా విత్తనోత్పత్తి ప్రారంభించి పలువురి ప్రశంసలందుకున్నాడు. సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానం శ్రీనివాస్‌ను ఆకర్షించింది. దేశీయ వరి రకాల ఉత్పత్తికి కృషి చేసినందుకు రైతు నేస్తం ఫౌండేషన్ వారు 'ఉత్తమ రైతు' అవార్డును శ్రీనివాస్‌కు అందజేశారు. 2024 సంవత్సరానికి గాను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో 'కర్షక రత్న' అవార్డును అందుకున్నాడు. రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని రైతులకు పరిచయం చేస్తున్నాడు.. ఆదిలాబాద్ జిలాల్లో ఏవోగా పని చేసేవాడు. ఏడాది కాలంగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నాడు.




దేశవాళీ రకంతో సాగైన వరి, ట్రేలో మొలకెత్తిన వరి



'ఉత్తమ రైతు' అవార్డు అందుకుంటున్న యాదగిరి శ్రీనివాస్

శ్రీనివాస్ ఉత్పత్తి చేస్తున్న దేశీయ వరి వంగడాలు..

- మాపిలై సాంబా, కులకార్, పుంగార్, బహూరూపి, బేళనాళ, నవారా, బర్మాబ్లాక్



దేశీయ వంగడాలతో 'ప్యాడీ ఆర్ట్'

ప్యాడీ ఆర్టిస్ట్‌గానూ..

దేశవాళీ వరి విత్తనాలతో ప్యాడీ ఆర్ట్ విధానాన్ని శ్రీనివాస్ అనుసరించారు. నల్లని వరిని వివిధ రూపాల్లో తీర్చిదిద్దడం 'ప్యాడీ ఆర్ట్'గా ప్రాచుర్యం పొందుతున్నాయి. జపాన్‌వంటి దేశాల్లో పాడీ ఆర్ట్ పేరున ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీన్ని అధ్యయనం చేసి తన పంట పొలంలో 'కాలాబట్టి' వరి విత్తనంతో గోమాత, అయోధ్య రామమందిరం ఆకారంలో సాగు చేసి శ్రీనివాస్ ప్రత్యేక తను చాటుకున్నాడు.. ఈ ఏడాది భారతదేశ పటాన్ని, 29 రాష్ట్రాలను తీర్చిదిద్దాడు.



మార్కెట్‌లో దీపావళి సందడి



ప్రమిదల కొనుగోలుతో సందడిగా మారిన మార్కెట్ రోడ్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళికి వారం రోజుల ముందు నుంచే మార్కెట్‌లో సందడి నెలకొంది. రకరకాల ప్రమిదలు, అలంకరణకు బొమ్మలు, పూజల కోసం గుమ్మడికాయలు, పూజా సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతుల్లో ప్రమిదలు అమ్మకాలకు ఉంచారు. లక్ష్మి, గణేశుడు, ఓంకారం, స్వస్తిక్, జ్యోతి, ఆకు, చేయి, నమస్కారం, కన్ను, దేవతా రూపాలు, పుష్పాల ఆకృతిలో ఉన్న ప్రమిదలే కాకుండా పలు డిజైన్లతో తయారు చేసిన ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. ప్రమిదలు ఐదు రూపాయల నుంచి 500 వరకు ధర పలుకుతున్నాయి.

వివిధ సైజుల్లో వత్తులు, నువ్వుల నూనె అమ్ముతున్నారు. ముగ్గుల సాంచెలు 20 రూపాయలకు ఒకటి చొప్పున అమ్ముతున్నారు. పూజల్లో ఉపయోగించేందుకు గుమ్మడి కాయలకు గిరాకీ పెరిగింది. గుమ్మడి కాయలు 80 నుంచి 120 రూపాయలకు ఒకటి చొప్పున పలుకుతున్నాయి. బొమ్మలు 50 నుంచి 100 రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. ఢిల్లీ నుంచి తెచ్చిన ప్రత్యేకంగా తెచ్చి పొట్టి శ్రీరాములుచౌక్ వద్ద అమ్ముతున్న బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉత్పత్తి, దిగుమతి రేట్లు పెరగడంతో ధరలు పెంచక తప్పలేదని వ్యాపారులు అంటున్నారు. వినియోగదారులు మాత్రం ధరలు పెరిగినా కొనక తప్పడం లేదని వాపోతున్నారు. ప్రధా నంగా అమ్మకాలు టవర్‌సర్కిల్, మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయం, జగిత్యాల రోడ్, శనివారం మార్కెట్, చిన్న షాపులు, ఆలయాల ప్రాంతాల్లో కొనసాగుతుండగా బండ్లు, రిక్షాల్లో పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు.




అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు



వివిధ రకాల ముగ్గుల రంగులు



రేపు ధన్‌తేరాస్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకల ప్రారంభ రోజు ధన్ తేరాస్ (ధన త్రయోదశి) బుధవారం జరుపుకోనున్నారు. ఈ రోజు బంగారం కొనుగోలు చేయడం ఆచారం. దీంతో బంగారం దుకాణాలు, జువెల్లరీ షాపుల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. ఆభరణాలను స్థాయిలకు తగ్గట్టుగా కొనుగోలు చేస్తున్నారు. త్రయోదశి నుంచి 3 రోజుల వరకు లక్ష్మీదేవికి, కుబేరుడికి అభిషేక అర్చనాదులు జరుపుతారు. వస్త్ర, వ్యాపార, వాణిజ్య నిలయాలను, కార్యాలయాలను శుద్ధి చేసి రంగులు వేస్తారు. మామిడి తోరణాలు, పసుపు, కుంకుమ, పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. పూజా మందిరాలను, దేవుడి పటాలకు అలంకారాలు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు కోట్ల వరకు వ్యాపారం జరుగనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

రాజన్న ఆలయంలో నరకచతుర్దశి ప్రత్యేక పూజలు



వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నరకచతుర్దశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ఉదయం 3.30 గంటల నుంచి 3.40 గంటల వరకు మంగళవాయిద్యములు, 3.40 గంటల నుంచి 4.20 వరకు సుప్రభాత సేవ, 4.20 నుంచి 4.30 వరకు సుప్రభాత హారతి, 4.30 నుంచి 4.40 వరకు నరక చతుర్దశి, దీపావళి పండగ సందర్భంగా మంగళహారతి నిర్వహించనున్నారు. ఉదయం 4.40 గంటల నుంచి 5 వరకు ఆలయశుద్ధి, 5 గంటల నుంచి స్వామి వారికి ప్రాతఃకాల పూజ చేపట్టనున్నారు. సాయంత్రం 4 గంటలకు నరకాసుర వధ పురాణకాలక్షేపము, 6.30 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో ధనలక్ష్మీ పూజ నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి పెద్ద సేవ చేపట్టనున్నారు.

కార్తీక మాసం పూజలు..

కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు స్వామి వారి కల్యాణ మండపంలో కార్తీక ప్రవచనము నిర్వహించనున్నారు. ప్రతీ సోమవారం స్వామి వారికి అనుబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి సోమవారం, ఏకాదశి పౌర్ణమి రోజుల్లో సత్యనారాయణస్వామి వ్రతం ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు నిర్వహించనున్నారు. 13న కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు రుక్మిణి విఠలేశ్వరస్వామి వారికి పంచోపనిష ద్వారా అభిషేకం సాయంత్రం 6.35 గంటలకు శ్రీకృష్ణ తులసీ కల్యాణం నిర్వహిస్తారు. 14న కార్తీక శుద్ధ త్రయోదశి రోజున వైకుంఠ చతుర్దశి సందర్భంగా అనంతపద్మనాభ స్వామికి పంచోపనిషత్ ద్వారా అభిషేకము చేస్తారు. ఉదయం 10 గంటలకు ప్రధాన, పరివార శివాలయములలో అన్నపూజలు, సాయంత్రం 6 గంటలకు అనంతపద్మనాభ స్వామికి అభిషేకము, అనంతరం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహాపూజ, పొన్నచెట్టుసేవ ఊరేగింపు చేపట్టనున్నట్లు తెలిపారు. 15న శుక్రవారం కార్తీక పౌర్ణమి రోజున ప్రదోషకాల పూజ అనంతరం రాత్రి 7.30లకు జ్వాలా తోరణము పూజ నిర్వహించనున్నారు. రాత్రి నిశీపూజ అనంతరం రాత్రి 10.15 గంటలకు రాజరాజేశ్వరస్వామికి మహాపూజ ఉంటాయి.

1న బీసీ కమిషన్ పర్యటన

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వెనుకబడిన తరగతుల కులాల అభివృద్ధి, సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ ఈనెల 1న ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తుందని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు బీసీ కమిషన్ చైర్మన్ సమావేశమై అభిప్రాయాలను స్వీకరిస్తారని అన్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ప్రజలు హాజరై కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంచార జాతుల వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని అన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఔత్సాహికులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా బీసీ కమిషన్ బృందానికి అందించాలన్నారు. అభ్యర్థనతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్‌ను పూరించి ఆరు సెట్లను కమిషన్ సభ్యులకు అందజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగనం



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ఆలయ ధర్మగుండంతో పవిత్ర స్నానాలను ఆచరించారు. క్యూలో ఆలయంలోకి ప్రవేశించి పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. స్వామివారికి కోడె మొక్కును చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాడాలి

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్



సభలో ప్రసంగిస్తున్న తిరుమలై రామన్

జ్యోతినగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాటం చేయాల్సిన అవసరముందని అఖిల భారత యువజన సంఘం(ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ అన్నారు. రెండు రోజులపాటు ఎన్టీపీసీలో జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో రామన్ సోమవారం ప్రసంగించారు. నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మతోన్మాదం పెరిగిందన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ఎన్డీఏ సర్కారు ప్రైవేటు పరం చేస్తోందన్నారు. యువత కేంద్రం కుట్రలను తిప్పికొట్టి ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాలన్నారు. రెండు రోజుల వర్క్‌షాప్‌నకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యువత రావడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాద్రి, నాయకులు ధర్మేంద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన వారికి జరిమానా

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో దొరికిన వారికి హుజూరాబాద్ కోర్టు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. కేశవపట్నం పోలీసులు డ్రంకెన్ నిర్వహించగా ఐదుగురు చిక్కారు. సోమవారం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఐదుగురికి 5,500 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులు

బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన సిరిసిల్ల విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో డీవైఎస్‌వో అజ్మీరా రాందాసు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన గోలి శ్రీవాత్సవ్, బూర్ల ఆశ్రిత్, ఆడెపు విగ్నేశ్వర్‌ను అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి గోలి శ్రీవాత్సవ్ రెండో సారి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీల ఎంపికకు సెలక్టర్లు ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేయగా అందులో ముగ్గురు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులే కావడం విశేషం. బ్యాడ్మింటన్ కోచ్‌లు ఆడెపు గణేష్, హమీద్, డేవిడ్సన్, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

న్యూస్ బాక్స్

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వీర్నపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులతో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు సమస్యలను పట్టించుకోవాలన్నారు. కార్మికులకు జీతాలు లేక కుటుంబ పోషణ భారం అవుతుందన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, పెండింగ్ జీవితాలను అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జీపీ కార్మికుల మండల అధ్యక్షుడు న్యాత నర్సయ్య, సురేష్, నగేష్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన విజయ్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని రేవంత్ మిత్ర మండలి, బృందం అధ్యక్షుడు, ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన గూడ విజయ్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విదేశీ పర్యటనను ముగించుకొని వచ్చిన మంత్రి ప్రభాకర్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని బీజేపీ మండల ఇన్‌చార్జి కరివెద మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్లంపట్ల, ఒగులాపూర్‌లో సోమవారం సభ్యత్వాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వాల గడువు రెండు రోజులే ఉందని, ప్రతీబూత్ పరిధిలో 300 సభ్యత్వాల సేకరణ లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. గ్రామాలలో పార్టీకి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం సేకరించడం లేదన్నారు. అన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలన్నారు. మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, నాయకులు బత్తిని స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

- కిటకిటలాడిన కలెక్టరేట్
- సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్


సిరిసిల్ల కలెక్టరేట్‌లో ప్రజావాణికి తరలివచ్చిన జనం

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విన్నపాలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలి వరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. ప్రజావాణి కేంద్రంలో జిల్లా కలెక్టర్‌తోపాట అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 154 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. త్వరితగితన పరిష్కారం చూపాలని, అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని అన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్. జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్లలో ఇసుక వేబిల్ పాయింట్ మార్చాలి

సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్, ఆదర్శనగర్‌లోని మానేరు వాగులో ఏర్పాటు చేసిన వేబిల్ ఇసుక పాయింట్‌ను మార్చాలని కాలనీవాసులు కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రం అందజేశారు. సాయినగర్, అదర్శ. నగర్‌లో కాలనీల్లో నుంచి వేబిల్‌లుకు ఇసుకను తీసుకెళ్లే ట్రాక్టర్‌లతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి మార్పులు జరగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక పాయింట్‌ను మార్చాలని లేకుంటే ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకుంటామని కుసుమ విష్ణు తెలిపారు.

● రైస్‌మిల్ బావులతో పంటలకు నష్టం

రైస్‌మిల్ వ్యార్థాలకోసం తవ్వుతున్న బావులతో తమ పంటలకు నష్టం వాటిల్లుతుందని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామస్థులు పేర్కొన్నారు. సర్వే నంబరు 99 /ఈలో ఎకరం 16 గుంటలు, 91/3లో 350 గుంటలు, 90/డీలో ఎకరం 16 గుంటలు, 91/2లో 350 గుంటలు, 90 /ఈ/2లో 20 గుంటలు, 90/గీ/2లో 20 గుంటల భూములు ఉన్నాయని, 32 సంవత్సరాల నుంచి కాస్తులో ఉంటూ వ్యసాయం చేసుకుంటున్నామని తెలిపారు. ఆ భూములను అనుకోని వెంకటేశ్వర రైస్‌మిల్లుకు కొంత మంది రైస్‌మిల్లు వ్యర్థాలు వెళ్లడానికి బావులను తవ్వుతు న్నారని దీంతో తమ భూములు కలుషితమై పంటలు పండకపోవడంతోపాటు భూగర్భజలాలు కలుషితం అవుతాయని అన్నారు. కలెక్టర్ స్పందించి సర్వేయించాలని, తమకు న్యాయం చేయాలంటూ గ్రామానికి చెందిన తీగల ప్రవీణ్, తీగల రాకేష్, వినయ్ కోరారు.

● ఉద్యోగం ఇప్పించండి

సిరిసిల్ల పట్టణంలోని దోబీగల్లికి చెందిన మహ్మద్ ముజీరుద్దీన్ తనకు చిన్న ప్పటినుంచి కళ్లు కనిపించడం లేదు. నేను ఇంటర్‌వరకు చదువుకున్నా. నాకు అంధత్వంతో బాధపడుతున్నాను. నాకు ఏదైనా ఉద్యోగం ఇప్పించి అదుకోవాలని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

లెక్క తేలనుంది..

(5వపేజీ తరువాయి)

ప్రత్యేక యాప్‌లో నమోదు

జిల్లాలో ఎన్యూమేటర్లు పశు గణనను సాంకేతికతను ఉపయోగించుకోనున్నారు. 21వ లైవ్ స్టాక్ సెన్సెస్ యాప్‌ను ప్లే స్టోర్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో పూర్తి వివరాలను అప్‌లోడ్ చేస్తారు. ఇందుకోసం ఎన్యూనేటర్లకు ఇప్పటికే శిక్షణ ను అందించారు. ప్రభుత్వం నుంచి ఐడీలు, ఇంకా క్రియేట్ కాకపోవడంతో పశు గణన ఇంకా మొదలు కాలేదు. పశువులు, గొర్రెలు, మేకలు, లెక్కలు తేలడం ద్వా రా పాల ఉత్పత్తి, మాంసం, గుడ్లు, ఉత్పత్తులపై ఒక అంచనాకు వస్తారు. దీని ద్వా రా పాడి పరిశ్రమ అభివృద్ధికి పథకాలు రూపొందించడం సులభతరం అవుతుంది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

(5వపేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి : నేతన్న చేయూత ద్వారా ప్రోత్సాహం అందుతోందా?

చేనేత జౌళి శాఖ ఏడీ : నేతన్నకు చేయూత పథకం ద్వారా కార్మికులకు ప్రోత్సాహం అందుతోంది. కార్మికులు సంపాదించిన మొత్తానికి పొదుపు, భద్రతను కల్పించడానికి ప్రభుత్వం నేతన్న చేయూత పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో పవర్‌లూం కార్మికులు వేతనంలో 8 శాతం పొదుపు చేస్తే ప్రభుత్వం 8 శాతం వాటాధనం ఇస్తుంది. సిరిసిల్లలో 5720 మంది కార్మికులు పథకంలో చేరారు. వీరికి పథకం కింద రూ.6.51 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం.

ఆంధ్రజ్యోతి : నేతన్న బీమా పథకంలో ఎంతమంది చేరారు?

చేనేత జౌళి శాఖ ఏడీ : నేతన్నబీమా పథకంలో పవర్‌లూం నేత కార్మికుల్లో 18 నుంచి 59 ఏళ్ల వయస్సు వారిని అర్హులుగా నిర్ధారించారు. ఈ పథకం కింద జిల్లాలో 5398 మంది కార్మికులు చేరారు. ఏదైనా కారణం చేత చనిపోతే కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లిస్తారు. జిల్లాలో ఇప్పటి వరకు 43 మంది కార్మికులకు సంబంధించి రూ.2.15 కోట్లు ఖాతాల్లో జమ చేశారు.

ఆంధ్రజ్యోతి : యారన్ సబ్సిడీ ఎంతవరకు వచ్చింది?

చేనేత జౌళి శాఖ ఏడీ : బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికులకు పది శాతం యారన్ సబ్సిడీ పథకాన్ని గత ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. బతుకమ్మ చీరలకు సంబంధించి 2018 నుంచి 2022 వరకు 5374 మంది కార్మికులకు రూ. 37.15 కోట్లు, 2023 సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో చేనేత పరిశ్రమ పరిస్థితి ఏంటి?

చేనేత జౌళి శాఖ ఏడీ : జిల్లాలో ఆరు చేనేత సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. ఇందులో 169 మంది కార్మికులు ఉన్నారు. జియో ట్యాగింగ్ చేసిన మగ్గాలు 103 ఉన్నాయి. నేతన్నకు చేయూత పథకంలో 211 మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. నేతన్నకు బీమా పథకంలో 56 మంది ఉన్నారు.

బిల్లులు ఇవ్వకపోతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్లు



రిలే దీక్షలో కూర్చున్న తాజా మాజీ సర్పంచులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకుంటే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్లు వేయాలని తాజా మాజీ సర్పంచుల జిల్లా కమిటీ తీర్మానం చేసింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ దీక్ష శిబిరంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ మాట్లాడారు. సర్పంచుల పెం డింగ్ బిల్లులను ప్రభుత్వం విడదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. 11 రోజులపాటు జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదన్నారు. కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు తాత్కాలికంగా రిలే నిరాహార దీక్షలను విరమిస్తామన్నారు. పెండింగ్ బిల్లుల విడుదల కోసం త్వరలో అఖిల పక్షాలతో సమవేశం ఏర్పాటు చేస్తామని, వారి సహకారం తీసుకుంటామని తెలిపారు. సర్పంచుల కుటుంబ సభ్యులతో జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వంటావార్పు, రాస్తారోకో చేపడతామన్నారు. కలెక్టర్ కార్యాలయం, జిల్లాలోని శాసన సభ్యుల ఇళ్ల ముట్టడి చేపడతామన్నారు. ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల వరకు పాదయాత్రలు చేస్తామన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాజా మాజీ సర్పంచులందరు నామినేషన్లు వేసి పోటీలో ఉంటారన్నారు. సాయంత్రం సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సిరిసిల్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆడెపు రవీందర్, బీఎస్పీ సిరిసిల్ల అధ్యక్షుడు అరుకుల రమేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ దీక్షలను విరమింపజేశారు. తాజా మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శులు కోల నర్సయ్య, గున్నాల లక్ష్మణ్, చల్ల నారాయణ, సంయుక్త కార్యదర్శులు గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం, కీర్తి రెడ్డి, మడిగల రవీందర్, గౌరవ సలహాదారులు చాకలి రమేష్, బొజ్జ మల్లేశం, సభ్యులు చిట్నేని శ్రీనివాస్‌రావు, తంపుల సుమన్, రాచూరి రాజేశం, ఆర్ మహేందర్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల గణన చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీసీ సంఘాల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుల గణనతో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కుల గణన చేయకపోవడంతో బీసీలు అన్ని రంగాల్లో నష్టపోయారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కుల గణన చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. నాయకులు నర్సయ్య, గౌస్, బాబు, బాల్‌రెడ్డి కిషన్, రాములు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన


ఫోన్‌లో మాట్లాడుతున్న డీఎం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల టీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రకాష్ రావు సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ప్రజల నుంచి స్పందన వచ్చింది. దాదాపు 15 మంది ఫోన్‌లో డీఎంతో మాట్లాడి సమస్యలను వివరించారు. సలహాలు సూచనలు చేశారు. సిరిసిల్ల నుంచి కాళ్లేశ్వరానికి, సిరిసిల్ల నుంచి కాకినాడకు, సిరిసిల్ల నుంచి ముచర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా వేములవాడ, సిద్దిపేట డిపోకు చెందిన ఏ ఒక్క బస్సు సిరిసిల్ల పట్టణం కొత్త బస్టాండ్‌కు రావడం లేదని ప్రతి బస్సు కొత్త బస్టాండ్‌కు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డీఎంను కోరారు. సిరిసిల్ల డిపో నుంచి కూడా సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యలం కల్పించాలని సిరిసిల్ల నుంచి కామారెడ్డికి పురుషులకు ప్రత్యేక బస్సులు వేయాలని ప్రజలు సూచించారు. ఈ సందర్భంగా డీఎం ప్రకాష్ రావు మాట్లాడుతూ ప్రజల విజ్ఞప్తులను ఉన్నతాధికారులకు పంపించి సాధ్యా సాధ్యాలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

డ్రా పద్ధతిన దుకాణాల కేటాయింపు

వేములవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో బాణాసంచా దుకాణాలను అధికారులు డ్రా పద్ధతిన కేటాయించారు. దుకాణాల లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు వ్యాపారులు తమకు మొదటి నుంచి 5 నంబర్లు లేదా చివరి నుంచి 5 నంబర్లు కేటాయించాలంటూ రాజకీయ నాయ కులు, ప్రజాప్రతినిధులతో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. మొదటి ఐదు, చివరి ఐదు నంబర్లు కేటాయించాలంటూ ప్రజా ప్రతినిధులు సైతం ఒత్తిడి పెంచడంతో నిస్సహాయులుగా మారిన అధికారులు సోమవారం దుకాణాల నంబర్ల కేటాయింపు కోసం డ్రా నిర్వహించారు. స్థానిక ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేష్ డ్రా తీశారు. డ్రా ప్రకారం దుకాణాల నంబర్లను కేటాయించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపీయూఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ధర్మాగ్రహదీక్షలో భాగంగా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, రాష్ట్ర కార్యదర్శి కటకం శ్రీనివాస్, రమణ, సుభాష్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని గ్రామస్థులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మఆదర్శ పాఠశాల ఛైర్మన్ సునీత మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 5వ తరగతుల్లో 76 మంది విద్యార్థులు చదువుతున్నారని, 6 నుంచి 8వరకు 36 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. పాఠశాలల్లో ఎనిమిది మంది ఉపాధ్యాయులు పనిచేసే వారని, బదిలీల తర్వాత మూడు స్కూల్ అసిస్టెంట్‌లు, మూడు ఎస్‌జీటీలు మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారని మిగితా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

బెటాలియన్ కానిస్టేబుళ్ల డిమాండ్‌లను నెరవేర్చాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బెటాలియన్ కానిస్టేబుళ్ల డిమాండ్‌లను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని బెటాలియన్ కానిస్టేబుళ్లపై పని భారాన్ని పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నెలకు 26 రోజులపాటు విధులను నిర్వహించడంతో బెటాలియన్ కానిస్టేబుళ్లు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఇష్టం వచ్చినట్లు డ్యూటీలు వేస్తున్నట్లు, అధికారుల గృహాల్లో ఇతరాత్ర పనులు చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సస్పెండ్ అయిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు పంతం రవి, సోమ నాగరాజు, బాచుపల్లి శంకర్ పాల్గొన్నారు.

పంట కాలువ మూసినవారిపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు చిన్నబోనాల శివారులో పంట కాలువ మూసినవేసనవారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ బోల్గం నాగరాజు, పడిగే లచ్చయ్య, చీటీ అశోక్‌రావు, మాదాడి వినోద్‌రావు, గోస్కుల ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కింద తీసిన కాలువను అక్రమంగా పూడ్చివేశారు. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రం అందజేశారు.కోనరావుపేట మండలం కొలనూరుకు చెందిన అనం తుల శ్రీనివాస్, సూర రవి, మర్తనపేటకు చెందిన బచ్చయ్య, సూర సుగుణాకర్ ధ్వంసం చేశారని ఆరోపించారు.

మార్కెట్ యార్డుకు భూమి కేటాయించాలి

గంభీరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపాన ఉన్న కాకుల గుట్ట ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని మార్కెట్ యార్డుకు కేటాయించాలని సోమవారం స్థానిక తహసీల్దార్ భూపతికి రైతులు వినతి పత్రం అందజేశారు. మార్కెట్ యార్డు లేక ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకుంటున్నామని, రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీసులు చెప్పారన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టే పరిస్థితి లేదన్నారు. అందుకే కాకుల గుట్ట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని మార్కెట్ యార్డుకు కేటాయించాలని,తమ కష్టాలను తీర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు మల్యాల రాజవీర్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా పాలనపై దృష్టిసారించాలి


మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షలు మానుకోవాలని, ప్రజాపాలనపై దృష్టి సారించాలని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్న కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్ర పన్నుతున్నారన్నారు. ఆయన బంధువుల ఇంటిలో విందు చేసుకుంటే డ్రగ్స్ మరకలంటించే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు సుభాష్, నర్సింహారెడ్డి, పర్శరాములు, హసన్, సందీప్ పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపే దమ్ము ఉందా?



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపించే దమ్ముందా అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా తప్పించుకుంటోందని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీనీ విమర్శిస్తోందని అన్నారు. నిన్న జరిగిన సంఘటనలో కేటీఆర్ బావమరిది ఇంట్లో ఫంక్షన్ చేసుకుంటుంటే అక్కడ డ్రగ్స్ ఉన్నాయని విదేశీ మద్యం ఉందని పోలీసులతో దాడులు చేయించారన్నారు. అక్కడ ఏమి దొరకనట్లు ఎక్సైజ్ సీఐ స్టేట్‌మెంట్ ఇచ్చారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కాంగ్రెస్ ఇదంతా చేస్తోందన్నారు. ఐదు సార్లు ఓడి మొన్న గెలిచిన ఆది శ్రీనివాస్ నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారన్నారు. మూడేళ్ల తర్వాత తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఎవరు జైలుకు వెళ్తారో ఎవరు బయట ఉంటారో చూద్దామని అన్నారు. పోలీసు వ్యవస్థ తప్పుడు కేసులు పెట్టి బదనాం చేసే పరిస్థితుల్లో ఉండవద్దని, ఎలాంటి ఒత్తిడికి గురికాకూడదండ నిజాయితీగా ఉండాలని సూచించారు. కేసీఆర్ మీకు చేసిన సేవలను మరిచిపోవద్దన్నారు. రాజకీయాలకు అతీతంగా పోలీసులు ఉండాలన్నారు. కేసీఆర్, కేటీఆర్ కుటుంబాన్ని విమర్శిస్తే పేరు వస్తుందని రఘునందన్, ఆది శ్రీనివాస్ నటనను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. త్వరలో కాంగ్రెస్, బీజేపీకి రాష్ట్ర ప్రజలు గోరీకడతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు చీత్కరిస్తున్నారని, రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ ఎన్నికలు వచ్చినా ఆ స్థానంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను గెలిపించుకోవాలని ప్రజలు ఆలోచన చేస్తున్నారని అన్నారు. డ్రగ్స్‌పై అసత్య ప్రచారం ఆపాలని దమ్ము ధైర్యం ఉంటే లైవ్‌డిటెక్టర్‌కు రావాలని కేటీఆర్ చేసిన సవాల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ సిద్ధంగా ఉండాలన్నారు. ముగ్గురిలో ఎవరు డ్రగ్స్ తీసుకుంటారో ప్రజల ముందు బయట పడుతుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి, కౌన్సిలర్ అన్నారపు శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు కుంభాల మల్లారెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ పాల్గొన్నారు.

రైతును రాజు చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


కస్తూర్బాలో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతును రాజు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోనరావుపేట మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పజెప్పినట్లు చెప్పారు. రైతుల సంక్షేమం దృష్ట్యా ఉచిత విద్యుత్ పంపిణీ ఫైల్‌పై తొలి సంతకం చేశారన్నారు. రైతు భరోసా త్వరలోనే ఇస్తామన్నారు. రుణమాఫీలో భాగంగా సుమారు 18 వేల కోట్ల రూపాయలను 22 లక్షల మంది ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. సాంకేతిక సమస్యతో కొందరు రైతుల ఖాతాల్లో జమ కాలేదని, అవి జమ చేయడానికి వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రేషన్ కార్డులు లేని వారిని గుర్తించి వారికి రుణమాఫీ వర్తింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతుల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అహర్నిశలు శ్రమించారని, అదే స్ఫూర్తితో ప్రస్తుతం రేవంత్ రెడ్డి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కోనరావుపేట మండలం పల్లిమక్తలో కొలనూరు నుంచి రామన్నపేట రోడ్డుకు కోటి 65 లక్షల రూపాయలు, బ్రిడ్జి నిర్మాణానికి కోటి 90 లక్షలు, సుద్దాల క్రాస్ రోడ్ నుంచి మంగళపల్లి బీటీ రోడ్డుకు కోటి 30 లక్షలు, మల్కపేట ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి రామాలయానికి సీసీ రోడ్డుకు 90 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని ఎక్కడా ఆపకుండా ముందుకు పోతోందని తెలిపారు. కోనరావుపేటలో పాస్టర్ సోమయ్య హఠాన్మరణం చెందగా భౌతికాయం వద్ద నివాళులర్పించారు. అంతకుముందు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం కొలనూరు గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామస్థులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కొలనూరు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టుకు మత్తడి నిర్మాణం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా మత్తడి నిర్మాణం చేపట్టాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో శంకర్ మూర్తి, ఏపీఎం రాకేష్, ఏఈవో రమేష్, కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, ఫిరోజ్ పాషా, చందనగిరి గోపాల్, అబ్దుల్ రషీద్, రుక్మిణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం జగదాంబతండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కామిరెడ్డి విజయ తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈవో రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్ విఠల్, బాల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ భీమ్లానాయక్, నాయకులు బల్యారాంరెడ్డి, లాల్యానాయక్, మాజీ సర్పంచ్ బాల్యానాయక్, మాజీ ఎంపీటీసీ కవిత ఉన్నారు.